క్లుప్తంగా

లక్ష్మీతిరుపతమ్మకు లక్ష మల్లెలతో పుష్పార్చన



గన్నవరం: స్థానిక పాతగన్నవరంలో కొలువైన శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో లక్ష మల్లెలతో పుష్పార్చనను ఘనంగా నిర్వహించారు. వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుక చేశారు. తొలుత శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం శ్రీలక్ష్మీసహస్రనామ పూర్వకంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీతిరుపతమ్మ సన్నిధిలో లక్ష మల్లెలతో భక్తులు పుష్పార్చన జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్, పలువురు పుర ప్రముఖులు, పరిసర ప్రాంత భక్తులు పాల్గొన్నారు.

బాలల హక్కులు కాపాడాలి



పెనమలూరు: బాలల హక్కులు ప్రతి ఒక్కరు కాపాడాలని వణుకూరు మహిళా సంరక్షణ కార్యదర్శి డి.వికల్ప అన్నారు. కిశోరి వికాసం సమ్మర్ క్యాంప్‌లో భాగంగా వణుకూరు, గోసాల, గంగూరు సచివాలయాల పరిధిలో మంగళవారం బాలల హక్కుల సంరక్షణ, పోక్సో చట్టం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లల హక్కులు కాపాడాల్సిన బాధ్యత అందరి పై ఉందన్నారు. లైంగిక వేధింపుల నుంచి చిన్నారులను కాపాడటానికి పోక్సో చట్టం ఉందని వివరించారు. పిల్లలను సంరక్షించటానికి 1098 చైల్డ్ లైన్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా కార్యదర్శులు ఎం.సుధారాణి, ఎస్.తబిత, విజయలక్ష్మి, ఎం.జ్యోతి, టి.లిఖిత, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉయ్యూరు రూరల్: బాలల హక్కులు సంరక్షణ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కాటూరు మహిళా సంరక్షణ కార్యదర్శి అనూష తెలిపారు. మండలంలోని కాటూరు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మండలంలోని బొల్లపాడు అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ కిశోరి వికాసం వేసవి శిక్షణ శిబిరం జరిగింది. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఇందిర, జయచింత, ఝాన్సీ లక్ష్మి, రజిని, రత్నకుమారి స్వర్ణకుమారి అమల, లత, నిర్మల జ్యోతి, మెర్సి పాల్గొన్నారు.

మోడీ ఫిట్‌నెస్‌పై ఇంటింటికీ శిక్షణ

పెనమలూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఇంటింటికి మోడీ ఫిట్‌నెస్ మంత్రలో భాగంగా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నామని యోగాశక్తి సాధన సమితి చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి 21వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వ స్పెషల్ ఛీఫ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కృష్ణబాబు బ్రోచర్ విడుదల చేశారని చెప్పారు. యోగా, ఆక్యుపంక్చర్, ఆక్యుప్రెజర్, ఆయుర్వేదం ఇలా మోడీ ఫిట్‌నెస్ మంత్రపై శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.

కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం



గన్నవరం: మండలంలోని కేసరపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీపద్మావతి అలివేలు మంగ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానం నిర్మాణానికి పలగాని సాత్విక్, కల్పన దంపతులు రూ.1,01,116 విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం విరాళం నగదును ఆలయ నిర్మాణ కమిటీకి సాత్విక్ దంపతులు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ...భక్తుల సహకారంతో శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ప్రతిష్టాత్మకంగా ని ర్మిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే పలువురు దాత లు స్వచ్ఛందంగా ముందుకొచ్చి విరాళాలు అందజేసినట్లు తెలిపారు. కమిటీ కార్యదర్శి మరీదు రాంబాబు, కోశాధికారి పలగాని మల్లేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు కొంతి కిషోర్ పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తూటికాడ తొలగింపు వేగంగా పూర్తి చేయాలి

కంకిపాడు: తూటికాడ తొలగింపు పనులు వేగంగా పూర్తి చేయాలని కంకిపాడు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ దేవినేని రత్నభూషణ్ తెలిపారు. నీటి సంఘాల బాధ్యుల ప్రత్యేక సమావేశం స్థానిక లాకు సెక్షన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. రత్నభూషణ్ మాట్లాడుతూ తూటికాడ తొలగింపు పనులకు రూ 1.40 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. నిబంధనలకు అనుగుణంగా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఏఈ పి.నాగబాబు, నీటి సంఘాల అధ్యక్షులు కొల్లి వెంకట కృష్ణారావు (వణుకూరు), వై.శ్రీనివాసరావు (గొడవర్రు), కుందేరు (కె.సుబ్బారెడ్డి), జి.నాగిరెడ్డి (పెద ఓగిరాల), నాదెండ్ల యుగంధర్ ప్రసాద్ (ఉయ్యూరు), కొల్లిపర వెంకటేశ్వరరావు (కపిలేశ్వరపురం), తాతినేని రామచంద్రరావు (గురజాడ) పాల్గొన్నారు.

ఈత కొలను అభివృద్ధి ఎన్నడో?

- భారీ వర్షాలకు ధ్వంసమైన ఈత కొలను ప్రాంగణం
- రూ.5 లక్షలకు పైగా నష్టం
- మరమ్మతులకు ఎదురుచూపులు



ఈడుపుగల్లులోని స్విమ్మింగ్ పూల్

కంకిపాడు: భారీ వర్షాలకు ఈత కొలను ధ్వంసమైంది. జిల్లాలో స్విమ్మర్లకు శిక్షణ అందిస్తున్న ముఖ్యమైన ఈత కొలను మరమ్మతులకు ఎదురుచూస్తోంది. మౌలిక వసతుల కల్పనతో అభివృద్ధి జరిగే స్విమ్మర్లు మరింత మెరుగ్గా శిక్షణ పొందేందుకు అవకాశం ఉంటుంది. కృష్ణా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మచిలీపట్నం తరువాత నడిచే ముఖ్యమైన స్విమ్మింగ్ పూల్ ఈడుపుగల్లులో ఉంది. దశాబ్దకాలంగా ఔత్సాహికులు స్విమ్మింగ్‌లో శిక్షణ పొందుతున్నారు. ప్రస్తుతం 90–100 మంది స్విమ్మర్లు ప్రత్యేక తర్ఫీదు పొందుతున్నారు. అందులోనూ వేసవి కావటంతో స్విమ్మర్ల సంఖ్య పెరిగింది. కృష్ణా జిల్లాలోని పలు మండలాలతో పాటుగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పరిసరాల నుంచి సైతం పిల్లలు, పెద్దలు ఈతలో మెలకువలు నేర్చుకుంటున్నారు.

అకాల వర్షంతో అపార నష్టం.....

ఇటీవల సంభవించిన అకాల వర్షాలతో స్విమ్మింగ్ పూల్‌కు భారీ స్థాయిలో నష్టం ఏర్పడింది. ఈడుపుగల్లు పరిధిలో వీచిన ఈదురుగాలులకు స్విమ్మింగ్ పూల్ సమీపంలో భారీ వృక్షాలు నేలకూలాయి. వర్షంతో స్విమ్మింగ్ పూల్ ప్రధాన గేట్లు ధ్వంసమయ్యాయి. వాటర్ ట్యాంకు దెబ్బతింది. ప్రహరీ చుట్టూ అమర్చిన రేకులు నేలకూలాయి. పడమర వైపున ఉన్న రేకులు ఎప్పుడు కుప్పకూలుతాయో అర్థం కాని పరిస్థితి.



ధ్వంసమైన ప్రహరీ రేకులు

మూడు రోజులు పాటు ఈత కొలను మూసివేసి తాత్కాలిక మరమ్మతులు పూర్తి చేసి స్విమ్మర్లకు అందుబాటులోకి తెచ్చారు.

అంచనాల్లో అధికారులు.....

భారీ వర్షంతో ఏర్పడిన నష్టంపై జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు అంచనాలను రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు.

త్వరలోనే మరమ్మతులు

భారీ వర్షాలతో ఈత కొలను పూర్తిగా దెబ్బతింది. ప్రాథమికంగా అంచనాలను రూపొందించి కలెక్టర్‌కు నివేదిక పంపాము. పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈత నేర్చుకునేందుకు వచ్చే స్విమ్మర్లకు అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలూ చేపడతాం.

– ఝాన్సీ, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, కృష్ణాజిల్లా

ఇప్పటికే జరిగిన నష్టంపై ప్రాథమిక సమాచారాన్ని జిల్లా కలెక్టరుకు సమర్పించారు. పూర్తి స్థాయిలో మరమ్మతులు నిర్వహించి, అభివృద్ధితో పాటుగా, మౌలిక వసతులు కల్పించే దిశగా సన్నాహాలు చేస్తున్నారు.

ఎట్టకేలకు దేవుడి భూమి స్వాధీనం

కంకిపాడు: దేవస్థానం భూమిని దేవదాయశాఖ అధికారులు ఎట్టకేలకు స్వాధీనం చేసుకున్నారు. పెనమలూరు మండలం తాడిగడప గ్రామానికి చెందిన శ్రీ సీతారామస్వామి దేవస్థానంకు చెందిన ఆలయ భూములు తెన్నేరు గ్రామంలో ఆర్ఎస్ నంబరు 374, 375లో 1.04 ఎకరాలు ఉంది. అర్చక సర్వీసు కింద ఇచ్చిన ఈ భూములు తదుపరి చేమార్పిడి జరిగాయి. రెవెన్యూ రికార్డుల్లోనూ మార్పులు జరిగాయి. విషయాన్ని గుర్తించిన దేవదాయశాఖ అధికారులు పూర్తి స్థాయి విచారణ జరిపించారు. రెవెన్యూ రికార్డులను సరిచేయించి దేవస్థానం భూమిని ఎట్టకేలకు దేవదాయ శాఖ పరిధిలోకి మార్పు చేయించారు. ఈ భూమిని మంగళవారం దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత భూమిలో బోర్డులు పాతించారు. కార్యక్రమాన్ని ఏసీ ఎన్‌వీ సాంబశివరావు, ఇన్‌స్పెక్టర్ ఎ.సుజన్‌కుమార్, ఈఓ బి.సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.



స్వాధీనం చేసుకున్న భూమిలో బోర్డు ఏర్పాటుచేసి సంతకాలు సేకరిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు



కంకిపాడు గ్రంథాలయంలో పుస్తక పఠనంలో పాల్గొన్న విద్యార్థులు



తెన్నేరు గ్రంథాలయంలో భగవద్గీత శ్లోకాలు పఠనం చేస్తున్న విద్యార్థులు



యోగా చేస్తున్న విద్యార్థులు



పురుషోత్తపట్నంలో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కంకిపాడు: వేసవి శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మండలంలోని తెన్నేరు గ్రంథాలయంలో విద్యార్థులకు మంగళవారం భగవద్గీత శ్లోకాల పఠనం, పుస్తక పఠనం, క్యారమ్స్, చెస్‌లో శిక్షణ ఇచ్చారు. పలువురు చిన్నారులు నృత్యంలో ప్రత్యేక శిక్షణ పొందారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరాలు కొనసాగుతున్నాయి. విద్యార్థులతో పుస్తక పఠనం, చిత్రలేఖనంలో పోటీలు నిర్వహించారు. ఆటల పోటీలు నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహించారు. శిబిరాన్ని టి.శేషుబాబు, కె.రాంబాబు, గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు.

విద్యార్థులకు యోగా శిక్షణ

పెనమలూరు: వణుకూరు గ్రామ గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో భాగంగా వణుకూరు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించామని గ్రంథాలయ అధికారి భారతి తెలిపారు. తొలుత విద్యార్థులకు పుస్తక పఠనం, తోక కథలు చెప్పించామని అన్నారు. ఆ తరువాత విద్యార్థుల్లో ఏకాగ్రత పెంచటానికి యోగా శిక్షణ ఇచ్చామని వివరించారు. విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం పెంచటానికి లెమన్ అండ్ స్పూన్, ఇతర ఆటల పోటీలు నిర్వహించామని పేర్కొన్నారు.

గన్నవరం రూరల్: చిత్రలేఖనం పోటీలు విద్యార్థుల్లోని సృజనను వెల్లడిస్తాయని పురుషోత్తపట్నం శాఖ గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో మంగళవారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోనూ ప్రతిభ ఉంటుందని, దానిని వెలికి తీయడానికి కృషి అవసరమన్నారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతి కుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు కథల పుస్తకాలు చదివించటం, చెప్పించటం, డ్రాయింగ్, యోగా పోటీలు నిర్వహించారు. పాఠకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీబీఎస్ఈలో సెయింట్ జాన్స్ నూరు శాతం ఉత్తీర్ణత




శశిమంజూష లాస్య

గన్నవరం: సీబీఎస్ఈ 2024–25 పరీక్షల్లో స్థానిక విఎస్. సెయింట్‌జాన్స్ హయ్యర్ సెకండరీ స్కూల్‌కు చెందిన పది, 12వ తరగతి విద్యార్థులకు నూరు శాతం ఉత్తీర్ణతను సాధించినట్లు ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు మొత్తం 220 మందిలో 103 మంది డిస్టింక్షన్ సాధించినట్లుగా తెలిపారు. వీరిలో 500 మార్కులకుగాను సీహెచ్ శశిమంజూష 491 సాధించి టాపర్‌గా, కె. లాస్య 490, కె. జోన పాలిన్, కె. ప్రద్యున్న 481 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లుగా తెలిపారు. 12వ తరగతి విద్యార్థులు కూడా నూరు శాతం ఉత్తీర్ణతతో సత్తా చాటినట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులను లోకల్ సుపియర్ బ్రదర్ బాలశౌరి, బ్రదర్ జిమ్మికురియోకోస్, బ్రదర్ భల్లా జోసఫ్, బ్రదర్ జయబాలన్ తదితరులు అభినందించారు.

బాల్యం నుంచే ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని గ్రంథాలయంలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరం తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ శిబిరంలో మంగళవారం విద్యార్థులకు ఆరోగ్యం-అలవాట్లు అనే అంశంపై తరగతులు నిర్వహించారు. వీరవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెడ్ నర్స్ కమలకుమారి హాజరై విద్యార్థులకు సమతుల్య పోష్టికాహారం, ఆరోగ్యవంతమైన ఆహారపు అలవాట్లు గురించి వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రతపై పాటించాల్సిన ప్రాధాన్యం తెలియజేశారు. చదువులో చురుగ్గా రాణించటానికి ఆరోగ్యవంతమైన మెదడు, దేహం ఎంతో అవసరమని పేర్కొన్నారు. గ్రంథాలయ అధికారి పి.స్వర్ణలతాదేవి పాల్గొన్నారు.

వెబ్ డెవలపర్ కోర్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్‌హబ్ సెంటర్‌లో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వెబ్ డెవలపర్ కోర్స్‌లో ఉచిత శిక్షణ నిమిత్తం నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి బీఎస్ఆర్ సుజిత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల కాల వ్యవధి కలిగిన ఈ కోర్సును అభ్యసించేందుకు ఇంటర్, డిగ్రీ, డిప్లొమో చదివిన 16 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులుగా పేర్కొన్నారు. శిక్షణ అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కోర్సు గుర్తింపు సర్టిఫికెట్‌తో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత ఆధార్ జిరాక్స్ కాపీ, పాస్‌పోర్ట్ సైజ్‌ఫొటోతో స్కిల్‌హబ్ సెంటర్‌ను సంప్రదించాలని కోరారు. ఇతర సమాచారం కోసం 9494005725 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

నేడు, రేపు ఆధార్ క్యాంపులు

కంకిపాడు: మండల కేంద్రమైన కంకిపాడు, మద్దూరు గ్రామాల్లో ఈ నెల 14, 15 తేదీల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్.బసవయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కంకిపాడు గ్రామ పంచాయతీ, మద్దూరు గ్రామ పంచాయతీల్లో ఆధార్ క్యాంపులు ఏర్పాటుచేశామన్నారు. శిబిరాల ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 12, 13 తేదీల్లో పునాదిపాడు పంచాయతీ, ఉప్పలూరు పంచాయతీల్లో నిర్వహించిన ఆధార్ క్యాంపులు మంగళవారంతో ముగిశాయని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ నిలిపివేత

పెనమలూరు: పోరంకి ప్రాంతంలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. రామాపురం కాలనీ 11 కేవీ ఫీడర్ మరమ్మతులు కారణంగా ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని పేర్కొన్నారు. దీని కారణంగా పెనమలూరు సెంటర్, సాలిపేట రోడ్డు, రామాపురంకాలనీ, డొంక రోడ్డు, బందరు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. స్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. దాత తవ్వా పూర్ణచంద్రరావు సహకారంతో 200 మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈవో తారకేశ్వర మూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

15 నుంచి ప్రత్యేక పూజలు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఈ నెల 15వ తేదీ నుంచి జరిగే అష్టబంధన, మహాసంప్రోక్షణ (కుంభాభిషేక) పూజల నిర్వహణకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఆలయం పునఃప్రతిష్ట జరిగి పుష్కరకాలం పూర్తయిన సందర్భంగా దేవదాయశాఖ కార్యక్రమం నిర్వహించ తలపెట్టింది. గురువారం ఉదయం విష్వక్సేన పూజ కార్యక్రమంతో ప్రారంభమయ్యే అష్టబంధన మహాసంప్రోక్షణ(కుంభాభిషేక) సోమవారం వరకు నిర్వహిస్తారు. చివరి రోజు రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి శాంతి కల్యాణం ప్రత్యేకత సంతరించుకుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ప్రధాన అర్చకులు రొంపిచర్ల అప్పలాచార్యులు, శేషాచార్యులు విజ్ఞప్తి చేశారు.

ఖాళీ స్థలాల్లో చెత్త పడేసై చర్యలు తప్పవు

రామవరప్పాడు: నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో చెత్త పడేసై చర్యలు తీసుకుంటామని ప్రసాదంపాడు పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తెలిపారు. విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులో పారిశుద్ధ్య చర్యల్లో భాగంగా ప్రమాదకరంగా మారిన ఖాళీ స్థలాలను అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో చెత్త పడేయకుండా అవగాహన తీసుకొస్తున్నట్లు వివరించారు.

విద్యుదాఘాతంతో పాడి గేద మృతి

పెనమలూరు: పోరంకిలో విద్యుదాఘాతంతో పాడి గేద మృతి చెందటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఉషారాణి తెలిపిన వివరాల ప్రకారం... 33/11 కేవీ విద్యుత్ తీగ తెగిపడి ఉంటడంతో గేద విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. మృతి చెందిన గేద ఖరీదు రూ 1.10 లక్షలు ఉంటుందని శివశంకర్‌రావు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: వివాహిత అదృశ్యమైన ఘటన పై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఉషారాణి తెలిపిన వివరాల ప్రకారం... పోరంకికి చెందిన భార్యాభర్తలు అశ్వనికుమార్, మౌనికకు మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మౌనిక సోమవారం ఇంటి నుంచి వెళ్లి పోతున్నానని భర్తకు ఫోన్ మెసేజ్ చేసింది. భర్త ఇంటికి వచ్చి చూడగా భార్య కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సూక్ష్మ రుణ ప్రణాళికలు సిద్ధం చేయండి

పెనమలూరు: జీవనోపాధుల కోసం సూక్ష్మ రుణ ప్రణాళికలు సిద్ధం చేయాలని డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై.హరిహరనాథ్ తెలిపారు. గంగూరులో వెన్నల గ్రామ సంఘం జీవనోపాధుల సూక్ష్మ ప్రణాళికల గురించి మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా హరిహరనాథ్ మాట్లాడుతూ పెనమలూరు నియోజకవర్గంలో గంగూరు గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. స్వయం సహాయ సంఘాలకు జీవనోపాధికి సూక్ష్మ రుణ ప్రణాళికలు సిద్ధం చేస్తే రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. స్వయం సహాయ సంఘాలు ఏమి వ్యాపారం చేయాలో ముందుగా సభ్యులు చర్చించుకొని సర్వేలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. గంగూరులో రోల్డ్ గోల్డ్ యూనిట్‌ను పరిశీలించారు. ఈ సమావేశంలో ఏపీఎం జి.కృష్ణంరాజు, సీసీ సీహెచ్.ఝాన్సీ, సీసీలు, వీఓఏలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



గంగూరులో స్వయం శక్తి సంఘ సభ్యులతో మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్

క్రమశిక్షణతో లక్ష్యాలు సాధన

పెనమలూరు: విద్యార్థులు లక్ష్యాలు సాధించటానికి క్రమ శిక్షణతో చదవాలని ఏపీ డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామినేషన్ కేవీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పెనమలూరు పీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో మంగళవారం మునుగోటి ప్రసాదరావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు మునుగోటి సత్యవతి, శ్రీనివాస్, రాధిక సహకారంతో 2024–2025 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో విజయం సాధించిన 192 మంది విద్యార్థుల గ్యాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉండే విధంగా ఉపాధ్యాయులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కోరారు. పెనమలూరు పాఠశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినందుకు అభినందించి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హేలాషారోన్, ఉప విద్యాశాఖ అధికారి ఐ.పద్మారాణి, హెచ్ఎం వై.దుర్గాభవాని, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కిలారు శివకుమార్, సర్పంచ్ లింగాల భాస్కరరావు, ఎస్ఎంసీ చైర్మన్ ఖైరున్‌బి, గ్రామస్తులు కిలారు బసవపున్నయ్య, కిలారు బ్రహ్మాజీ, కిలారు నాగశ్రవణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పెనమలూరులో గ్యాడ్యుయేషన్ డేలో పాల్గొన్న విద్యార్థులు

చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామికి ప్రత్యేక పూజలు



నున్న(విజయవాడరూరల్): చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి 132వ జయంతి సందర్భంగా చినకంచి క్షేత్రంలో మంగళవారం అంగరంగ వైభవంగా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత ప్రాత కాలాభిషేక అర్చన అనంతరం స్వామి వారికి మాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని బ్రహ్మశ్రీ జొన్నవిత్తుల వెంకటరామ శర్మ ఆధ్వర్యంలో చేశారు. భస్మాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం స్వామికి అలంకరణ చేసి లక్షమల్లెలతో అర్చన చేశారు. అనురాధ స్వస్తి నివేదన నిర్వహించారు. వసంత రుతువు సందర్భంగా సంపూర్ణ కృష్ణ యజుర్వేద పారాయణం వేద పండితులు నిర్వహించారు. శివపార్వతుల కల్యాణం అంగరంగా వైభవంగా చేశారు. వేద విద్యార్థులు ఉపనిషత్ పారాయణ చేసి, జంగల్వల ఉమామహేశ్వరరావు దేవాలయంలో మొదటిసారి తులాభారం తూగి పటిక బెల్లాన్ని, కందిపప్పును ప్రసన్న వెంకటేశ్వరస్వామికి సమర్పించారు. భక్తులందరికి తీర్థప్రసాద వినియోగంతో పాటు భోజనాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం వేదసభ నిర్వహించారు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

కంకిపాడు: ఈ నెల 20న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.రంగారావు పిలుపునిచ్చారు. కంకిపాడులోని మండేపూడి భవన్‌లో ప్రజాసంఘాల నేతల ముఖ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. రంగారావు మాట్లాడుతూ కార్మికులను కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ 26 వేలు అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ యత్నాలు విరమించుకోవాలని కోరారు. స్కీం వర్కర్లను, కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అందించాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో సీఐటీయు మండల అధ్యక్ష, కార్యదర్శులు జి.కుమారి, టీ.నరేష్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు వై.నశినీకుమారి, దుర్గా రూప సుందరి, రాజ్యలక్ష్మి, శారద, పల్లవి, రైతు సంఘ నేతలు వి.శివశంకర్, పి.దుర్గారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వి.జాన్‌మోజేస్, ప్రజా సంఘాల బాధ్యులు జె.రవి, గోపి, దీపక్, పి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ప్రజాసంఘాల నేతలు

నూతన క్రీడా ప్రాంగణం నిర్మాణానికి శంకుస్థాపన

గన్నవరం: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న క్రీడా ప్రాంగణానికి మంగళవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు శంకుస్థాపన చేశారు. క్రీడాకారుల కోసం ఇక్కడ క్రికెట్ బాక్స్, స్విమ్మింగ్ పూల్, బ్యాడ్మింటన్ కోర్టులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి క్రీడా ప్రాంగణాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. క్రీడాకారులకు అవసరమైన వసతులను కల్పించినప్పుడే వారిలోని ప్రతిభను వెలికితీయడం సాధ్యమవుతుందన్నారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, మాజీ సర్పంచి గూడపాటి తులసీమోహన్, ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ